క్లుప్తంగా

నేడు గౌరీ పరమేశ్వరుల కల్యాణం


గౌరీ పరమేశ్వరులు

నర్సీపట్నం : మున్సిపాలిటీ గవరవీధి శ్రీగౌరీ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో 42వ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సేవా సంఘం వారు ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశామని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కమిటీ వారు విజ్ఞప్తి చేశారు.

చదవడం అభిరుచిగా మారాలి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న లైబ్రేరియన్ దమయంతి

నర్సీపట్నం : చదవడం ఇష్టంగా అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారిణి దమయంతి విద్యార్థులకు సూచించారు. శాఖ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకు ఇష్టం కార్యక్రమానికి విద్యార్థులు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు గ్రంథాలయానికి విచ్చేసి పుస్తక పఠనం చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పిల్లలు నీతి కథలు చదువుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పోటీ పరీక్షలకు ఉపయోగపడే జనరల్ నాలెడ్జ్ క్వశ్చన్స్ విద్యార్థులను అడిగి, వాటికి సమాధానాలు చెప్పించారు. అనంతరం పిల్లలతో ఆటలు ఆడించారు.

ఘనంగా క్రీస్తురాజు పండగ


విశ్వాసులకు సువార్త చదివి వినిపిస్తున్న ఫాదర్లు

రోలుగుంట : స్థానిక రోమన్ క్యాథలిక్ చర్చిలో ఆదివారం క్రైస్తవులు క్రీస్తురాజు పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ చర్చికు వస్తున్న స్థానికులతో పాటు కొవ్వూరు, కె.నాయుడుపాలెం, భోగాపురం, కొత్తకోట, పెదబొడ్డేపల్లి గ్రామాల నుంచి మతస్థులు నూతన వస్త్రాలు ధరించి కుటుంబ సమేతంగా చర్చికి వచ్చి ప్రార్థనలు చేశారు. వీరందరికీ పెద బొడ్డేపల్లి ఫాదర్ బిన్నీ, మాడుగుల ఫాదర్ ఫ్రాన్సిస్, విచారణ ఫాదర్ అజయ్‌కుమార్, చోడవరం విచారణ ఫాదర్ గురుశ్రీ ప్రసాద్ విశ్వాసులకు సువార్త చదివి వినిపించారు. మధ్యాహ్నం చర్చ్ కమిటీ భోజన ఏర్పాట్లు చేశారు.

తురువోలు మోదకొండమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ : మండలంలోని తురువోలు మోదకొండమ్మను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఈ మేరకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం నాలుగో ఆదివారం సందర్భంగా గ్రామస్తులు మోదకొండమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వన భోజనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

విహారయాత్రలతో విజ్ఞానం, వినోదం

- విద్యార్థులతో విశాఖ మేయర్ హరివెంకట కుమారి


విద్యార్థులతో మాట్లాడుతున్న విశాఖ మేయర్ హరి వెంకట కుమారి

కె.కోటపాడు : చదువులతోనే ఉన్నత ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని విశాఖపట్నం మేయర్ జి. హరి వెంకట కుమారి అన్నారు. విశాఖపట్నం ముడసర్లోవ, రుషికొండ, కైలాసగిరి ప్రాంతాలలో ఆదివారం అయ్యన్న పాఠశాల విద్యార్థులు విహార యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముడసర్లోవలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ హరి వెంకట కుమారి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఇటువంటి విహార యాత్రలతో విజ్ఞానంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందని మేయర్ అన్నారు. కార్యక్రమంలో అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జోరుగా ఖరీఫ్ వరి కోతలు

- మరోవైపు రబీ వరి సాగు
- కానరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- తుపాను ప్రభావంతో వరి చేలు కుడదీస్తున్న పనిలో రైతులు బిజీబిజీ
- నియోజకవర్గంలో 72 వేల ఎకరాల్లో రబీ సాగుకు శ్రీకారం


గాదిరాయిలో వరి కోతలు చేపడుతున్న మహిళా రైతులు


సాగరంలో రబీ వరి నారు మడి


ఖరీఫ్ వరి చేలు నూర్పిళ్లు

నియోజకవర్గంలో రెవెన్యూ గ్రామాలు	148
మొత్తం రైతులు	68 వేల మంది
రబీ సాగు విస్తీర్ణం	72 వేల ఎకరాలు
పెసలు, మినుములు	40 వేల ఎకరాలు
మొక్కజొన్న సాగు	14 వేల ఎకరాలు
రబీ వరి చేలు	18వేల ఎకరాలు

మాడుగుల : గోవాడ చెరకు కర్మాగారం చెరకు పేమెంట్స్ సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల నియోజకవర్గ రైతులు ఖరీఫ్‌కు సంబంధించి అధికంగా వరి సాగు చేశారు. గతంలో చెరకు, వరి వల్ల ఆదాయం వచ్చేది. కానీ ఈ ఏడాది కేవలం వరి మాత్రమే ఆదాయ మార్గంగా మారింది. ఈ ఏడాది ఖరీఫ్, రబీలు సీజన్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ఖరీఫ్ వరి పంటలు బాగా అనుకూలించాయి. చివరి దశలో కొంత మేర తెగుళ్లు ఆశించాయి. కానీ పంట దశకు చేరుకున్నాయి. నియోజకవర్గంలో ఈ ఏడాది వరి చేలు బాగా పండడంతో దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. మరోవైపు రబీ సాగు వైపు దృష్టి సారించారు. రబీ వరి నారు మడులు తయారు చేస్తున్నారు. అపరాలు పంటలైన మినుములు, పెసలుతో పాటు వాణిజ్య పంటలు జొన్నలు, వైపు రైతులు దృష్టి సారించడంతో పొలం పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. నియోజకవర్గంలో పెద్దేరు, కోనాం, రైవాడ, జలాశయాలు ఆయకట్టు భూముల్లో ప్రస్తుతం ముమ్మురంగా పనులు జరుగుతుండడంతో కూలీలకు చేతి నిండా పనులు దొరుకుతున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు రావడంతో తుపానులు వస్తాయని తెలపడంతో ఖరీఫ్ వరి చేలు కోతలు కోసి కుప్పలు పెడుతున్నారు. చెరువులతో పాటు జలాశయాల్లో సాగు నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు రబీ పంటల వైపు దృష్టి సారించారు.

మద్దతు ధరలు పెంచాలి



గోవాడ చక్కెర కర్మాగారం పేమెంట్స్ సక్రమంగా ఇవ్వకపోవడంతో నియోజకవర్గం రైతులు చెరకు సాగు తగ్గించి వరి సాగుపై దృష్టి పెట్టారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధరలు పెంచాలి. వాతావరణం కొంత అనుకూలించడంతో చెరువులు, జలాశయాల్లో సాగు నీరు ఉండడం వల్ల రబీ సాగుకు దిగాం. ప్రస్తుతం ఖరీఫ్ వరి కోతలు ముమ్మురంగా జరుగుతున్నాయి. వాతావరణంలో మార్పులు రావడంతో కోసిన వరి చేలు కుప్పలు వేస్తున్నాం. వర్షాలు కురిస్తే పొలాల్లో నూర్చిన ధాన్యం నష్టపోతామని భయంగా ఉంది. ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

– పత్రే.రామునాయుడు, రైతు, గాదిరాయి

రబీ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి

ప్రస్తుతం వరి విత్తనాలతో పాటు అపరాల విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ వరి చేలు కోతలు జరుగుతున్నందున మరో వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం తుపాను హెచ్చరికలు ఉండడం వల్ల కోసిన వరి చేలు వెంటనే కుప్పలు చేసుకోవాలి. కోయలేని వరి చేలు వాయిదా వేసుకోవాలి. అపరాలు రబీకి సంబంధించి నవంబరు 15 నుంచి డిసెంబరు 15 వ తేదీ లోపు వేసుకోవాలి. విత్తన శుద్ధి చేసి విత్తనాలు వేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయి.

– ఎం.వాసుదేవరావు, ఏవో, మాడుగుల

కానరాని కొనుగోలు కేంద్రాలు

ఒక పక్క రైతులు ఖరీఫ్ వరి చేలు కోసి కుప్పలు పెట్టి యంత్రాలతో నూర్పిడి చేస్తున్నారు. ధాన్యం పొలాల్లోనే ఉన్నాయి. కానీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సరైన మోతాదులోనే మందులు వాడాలి


పశువైద్యశాల ఏడీ డాక్టర్ రాంబాబు

నర్సీపట్నం : ప్రస్తుత కాలంలో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లలో యాంటీబయోటిక్స్, ఇతర ఔషధాల వినియోగం పెరగడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో అవి పని చేయడం లేదని, సరైన వ్యాధికి సరైన మోతాదులో జాగ్రత్తగా మందులను వాడాలని ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. ప్రపంచ యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఎక్కడికక్కడ అవగాహన సదస్సులు పెట్టి రైతులకు వివరిస్తున్నామన్నారు. తక్కువ మోతాదులో, అవసరం లేకుండా ఔషధాల వినియోగం వల్ల పశువుల్లో కలిగే దుష్ప్రభావాలపై పాడిరైతులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. అతిగా యాంటీబయోటిక్స్ వాడితే పశు ఉత్పత్తులైన పాలు, మాంసం, గుడ్లు ద్వారా మనుషులకు కలిగే ఇబ్బందులను వివరించారు.

వరికోతలను వాయిదా వేసుకోవాలి

చీడికాడ : తుపాను ప్రభావం తగ్గే వరకు రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఏవో కృష్ణవేణి తెలిపారు. ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 26, 27వ తేదీల్లో తుపాను ప్రభావం మన ప్రాంతంపై ఉంటుందని తుపాను ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని కోరారు. ఇప్పటికే వరికోతలు కోసిన రైతులు తమ మడుల్లోనే చిన్న చిన్న కుప్పలుగా పెట్టుకోవాలన్నారు. కురిసిన వర్షం పొలంలో నిల్వ ఉండకుండా మడుల నుంచి నీరు బయటకు పోయే కాలువలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అల్పపీడనంతో రైతులు అప్రమత్తం

మాడుగుల రూరల్ : దక్షిణ అండమాన్ సముద్రం ఆగ్నేయ బంగాళాఖాతంపై విస్తరించిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 26, 27, తేదీల్లో వర్షాలు పడే అవకాశం వుందని వాతావరణశాఖ అధికారులు ముందస్తుగా హెచ్చరిక చేశారు. మండలంలో 4,419 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పది శాతం మేర వరి కోతలు చేశారు. ఇప్పటి వరకు వరి కోతలు చేయని రైతులు తుపాను ప్రభావం తగ్గే వరకు 4, నుంచి 5 రోజుల పాటు వరి కోతలు వాయిదా వేసుకోవడం మంచిదని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. ఇప్పటికే వరి కోతలు కోసిన వరి పంటను పొలంలో చిన్న చిన్న కుప్పలు గాని, లేదా కళ్లాల్లో కుప్పలుగాని పెట్టుకోవాలని, కుప్పలు మీద టార్పెన్లు కప్పి ఉంచాలని, ధాన్యం నూర్చిన వారు గోనె సంచుల్లో నింపి జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని, వరి పనలు తడిసినట్టయితే గింజ మొలకరాకుండా, తడిసిన గింజ రంగు మారకుండా ఉండడానికి 50 గ్రాములు కళ్లు ఉప్పును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

సందడిగా కార్తీక వన సమారాధనలు


కొమరవోలు గ్రామంలో బందారు వారి కల్లాల వద్ద నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమం


అల్లూరి సమాధికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రోలుగుంట : కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం పలు గ్రామాల్లో కార్తీక సమారాధన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకున్నారు. కొమరవోలు గ్రామానికి చెందిన బండారు వారి కళ్లాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ వన భోజనాలతో ఆటా,పాటలతో సందడి చేశారు. అయ్యప్ప మాలధారులతో పాటు సాధారణ భక్తులకు అన్న సమారాధన జరిపారు. ఈ సందర్భంగా కార్తీక మహత్యం గురించి వక్తలు వివరించారు. అలాగే గ్రామానికి చెందిన భోశం వారి మామిడి తోటలోను, కొండపాలెంలోను కార్తీక వన సమారాధనలు జరిగాయి.

అల్లూరి పార్కులో విద్యార్థుల వన సమారాధన

మాకవరపాలెం : కార్తీక వనసమారాధనలో భాగంగా తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం కృష్ణదేవిపేటలోని అల్లూరి పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సమాధిని సందర్శించి, పార్కులో ఆటలాడుకున్నారు. విద్యార్థులకు తెల్లదొరలను ఎదిరించి గిరిజనులకు అండగా నిలబడిన అల్లూరి చరిత్రను వివరించినట్టు హెచ్ఎం రాము తెలిపారు. అనంతరం ధారమఠం లోని శివాలయంతోపాటు జలపాతాన్ని తిలకించినట్టు చెప్పారు. వన సమారాధన పేరుతో విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విద్యార్థులను తీసుకువెళ్లినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కార్తీక మాసం నాలుగో ఆదివారం పురస్కరించుకుని, గ్రామాల్లో కార్తీక సమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కుటుంబాలు సామూహికంగా కార్తీక సమారాధనలో పాల్గొన్నారు. కె.జె.పురం శివాలయంలో స్థానికంగా వుంటున్న వైశ్యులు సామూహికంగా అన్న సమారాధన నిర్వహించారు. గ్రామంలో రెండు చోట్ల కళ్లం పాకల వద్ద అన్నసమారాధన జరిగింది. వీటితో పాటు మండలంలో పెద్దేరు, తాటిపర్తి, మాడుగుల పాలగెడ్డ ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో కార్తీక సమారాధనలు నిర్వహించారు. దీంతో పాటు తాటిపర్తి శివారు బిళ్లలపాలెంలో కార్తీక సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భూగర్భ శివాలయంలో అభిషేకాలకు ఏర్పాట్లు


భక్తులు స్వహస్తాలతో అభిషేకాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న భూగర్భంలో శివలింగాలు

నాతవరం : కార్తీకమాసం ఆఖరు సోమవారం కావడంతో చిక్కుడుపాలెంలో గల శ్రీశివ శక్తి క్షేత్రం శివాలయంలో స్వహస్తాలతో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెంలో భూగర్భంలో శివాలయం నిర్మించారు. ఇక్కడ అన్ని రకాలు శివలింగాలు ఏర్పాటు చేశారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో భక్తులు స్వహస్తాలతో శివలింగాలకు అభిషేకాలు పూజలు చేసేందుకు వేదపండితులు శ్రీ సీతారామ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా వెదురుపల్లి గ్రామంలో రేటమ్మ కొండపై వెలసిన శివ పార్వతుల ఆలయంలో కూడా సోమవారం పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సంఘమిత్ర సొసైటీతో నిరంతర సేవలు

ఘనంగా 20వ వార్షికోత్సవం


వైద్యులు మధుసూదనపాత్రుడు, బి.సరితలను సన్మానిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు

కె.కోటపాడు : సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా మాడుగుల నియోజకవర్గంలో 20 ఏళ్లుగా ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు సొసైటీ అధ్యక్షుడు, ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ బండారు రామచంద్రరావు అన్నారు. కె.కోటపాడులో ఆదివారం వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘమిత్ర అధ్యక్ష, కార్యదర్శులు బండారు రామచంద్రరావు, బొంతు మంగపతిలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. సంఘమిత్ర ద్వారా 210 వైద్య శిబిరాలతో పలువురికి ఉచితంగా వైద్యం, మందులు అందించినట్టు డాక్టర్ రామచంద్రరావు తెలిపారు.పద్మపూజిత ఫైనాన్స్ కంపెనీ చైర్మన్ రాయపురెడ్డి శ్రీనివాస వరప్రసాద్ మాట్లాడుతూ సంఘమిత్ర సేవా కార్యక్రమాలకు సంస్థ ద్వారా తోడ్పాటు అందించనున్నట్టు తెలిపారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం



బి.రామచంద్రరావు, ఎస్.గణేష్

చోడవరం : చోడవరం మండల ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యు.టి.ఎఫ్) నూతన కార్యవర్గం 2024–25 సంవత్సరానికి గాను చోడవరంలో ఆదివారం ఏర్పాటు చేశారు. యు.టి.ఎఫ్ గౌరవ అధ్యక్షులుగా వేగి సూర్య ప్రకాశరావు, అధ్యక్షుడిగా బొడ్డపాటి రామచంద్రరావు, సహాధ్యక్షులుగా రాజా రమేష్, మహిళా అధ్యక్షురాలిగా వి. చైతన్యశీల, ప్రధాన కార్యదర్శిగా ఎస్. గణేశ్, జిల్లా కౌన్సిలర్‌గా బి.చంద్రయ్య, కోశాధికారిగా యు.ఎస్. బాబ్జి, ఆడిట్ కమిటీ సభ్యులుగా జామి రమేశ్, వేచలపు రామకృష్ణ, లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రూ.14.4 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం


భీమబోయినపాలెంలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న డీఈ

మాకవరపాలెం : గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి మొదటి విడతగా రూ.14.4 కోట్లు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ డీఈ ఈశ్వరరావు తెలిపారు. భీమబోయినపాలెంతో పాటు పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీల నాణ్యతను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు పనులు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలానికి ఉపాధి హామీ పథకంలో 187 పనులకు రూ.14.4 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. రెండో విడతగా 315 పనులకు రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. మొదటి విడతలో మొత్తం 27 కిలోమీటర్లమేర సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. ఆయన వెంట భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నంనకిషోర్ ఉన్నారు.

మమ్మరంగా వాహనాల తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ రామారావు

గొలుగొండ : రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పి. రామారావు తెలిపారు. ఆయన ఆదివారం సాయంత్రం గొలుగొండలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని వాహనదారులకు కేసులు నమోదు చేశారు. గంజాయి అక్రమ రవాణాపై నిఘా ఉంచామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన స్పీకర్


బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు


సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

నర్సీపట్నం : నియోజకవర్గంలోని అనారోగ్యానికి గురైన బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయి. క్యాంపు కార్యాలయంలో బాధితులకు స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు ఆదివారం అందజేశారు. మున్సిపాలిటీకి చెందిన పంచాడ సుధాకర్ రూ.2,50,869, శ్రీను రూ.1,35,343, బలిఘట్టంకు చెందిన అద్దాల లోవరాజు రూ. 1,49,538, మాకవరపాలెం మండలం, తూటిపాలకు చెందిన గనిశెట్టి హేమన్య రూ.లక్షా 50 వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : ఆపదలో వున్న వారిని ఆదుకోవడమే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. చోడవరం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో గల 8 మంది బాధితులకు రూ. 9,97,208 ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన టీడీపీ అధ్యక్షులతో పాటు కె.జె.పురం ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, వంటర్లపాలెం మాజీ సర్పంచ్ కుమార రాజు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం


కె.జె.పురంలో గౌరీ పరమేశ్వరుల ఉరేగింపు


ఊరేగింపులో మహిళల కోలాటం


ఎ.కొత్తపల్లిలో గౌరీ పరమేశ్వర్ల ఊరేగింపులో పాల్గొన్న చింతల సత్య వెంకటరమణ తదితరులు


చౌడువాడలో గౌరీపరమేశ్వరులకు పూజలు

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం గ్రామంలో గౌరీ పరమేశ్వర్లు ఉత్సవాలు శనివారం అర్ధరాత్రితో ముగిసాయి. ఈ నెల 5 వ తేదిన గౌరీ పరమేశ్వర్లను గ్రామంలో శాలిపేట చావిడిలో ప్రతిష్ఠించారు. 19 రోజుల పాటు పూజలు అందుకున్న గౌరీ పరమేశ్వర్లను శనివారం అర్ధరాత్రి ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పుర వీధుల్లో గౌరీ పరమేశ్వర్లను ఉరేగించారు. మహిళలు కోలాటం అలరించింది. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవంలో పాల్గొన్నారు.

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లిలో గౌరీ పరమేశ్వర్ల నిమజ్జన మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళల కోలాటం, తప్పెటగుళ్లు, తీన్‌మార్ వాయిద్యాలు నడుమ రామలయం నుంచి ప్రారంభమై గ్రామ పుర వీధుల మీదుగా గౌరీ పరమేశ్వర్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. ప్రతి ఇంటా గౌరీ పరమేశ్వర్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ సరువునాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు : చౌడువాడలో సతకంపట్టు, గవరపేటలలో ఏర్పాటు చేసిన గౌరీపరమేశ్వరుల అనుపు కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. గ్రామంలో గల ప్రధాన వీధుల్లో గౌరీపరమేశ్వరుల ఊరేగింపు, మహిళా కోలాటాల నడుమ అనుపు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

చీడికాడ : అప్పలరాజుపురం ఉన్నత పాఠశాలలో 1984–85 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఉదయం అప్పలరాజుపురం ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు వారి అనుభవాలు, చిన్ననాటి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. వీరందరూ ఒకరికొకరు సహకరించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ బ్యాచ్‌లో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పాల్గొన్నారు.